183) భైరవి

ప॥ నీవు జగన్నాథుడవు నే నొకజీవుడ నింతే। నీవలె ననుభవించ నే నెంతవాడను॥

చ॥ వైకుంఠపదమే వడి గోర నెంతవాడ। యీకడ నీదాసుడనౌ టిది చాలదా।
చేకొని నీసాకారచింత యేడ నేనేడ।పైకొని నీడాగు మోచి బ్రదికితి జాలదా॥

చ॥ సొంపుల నీయానందసుఖ మేడ నే నేడ। పంపు శ్రీవైష్ణవసల్లాపన చాలదా।
నింపుల విజ్ఞాన మేడ నే దెలియ నెంతవాడ। యింపుగా నీకథ విను టిదియే చాలదా॥

చ॥ కైవల్యమందు నీతో కాణాచి యాడ నాకు। శ్రీవేంకటాద్రిమీది సేవ చాలదా।
యీవల శ్రీవేంకటేశ నీ విచ్చినవిజ్ఞానమున। భావించి నిన్ను బొగడే భాగ్యమే చాలదా॥